క్లుప్తంగా

పర్యావరణ, పౌర హక్కుల సంస్థ కార్యాలయం ప్రారంభం



కార్యక్రమంలో పాల్గొన్న సంస్థ సభ్యులు

గాజువాక : గాజువాక హైస్కూల్ రోడ్‌లో ఏర్పాటు చేసిన పర్యావరణ, ప్రజా పౌర హక్కుల రక్షక సాంఘిక సంక్షేమ సంస్థ కార్యాలయాన్ని ఆ సంస్థ వ్యవస్థాపక ముఖ్య కార్యదర్శి ఒ.వెంకట విశ్వనాథ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య ప్రజలకు పర్యావరణ రక్షణ, పౌర హక్కుల గురించి తమ సంస్థ ద్వారా అవగాహన కల్పిస్తామని తెలిపారు. ప్రజలు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని పొంది రాజ్యాంగ బద్ధంగా జీవించేందుకు తమ సంస్థ కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఎం.మల్లేశ్వరరావు, వి.శ్రీధర్, నిరంజన్ కుమార్ యాదవ్, పి.కృష్ణ, జి.లక్ష్మణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో రూ.4.10 లక్షల జరిమానా



డాబాగార్డెన్స్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష చేస్తున్న టూటౌన్ ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మి

అల్లిపురం : మద్యం తాగి వాహనాలు నడిపితే రూ.10 వేలకు పైగా జరిమానా తప్పదని టూటౌన్ ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మి తెలిపారు. శనివారం ఒక్కరోజే టూటౌన్ పరిధిలో 36 మంది నుంచి కోర్టు రూ.4 లక్షల 10 వేలు జరిమానా విధించిందని పేర్కొన్నారు. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పెన్ స్కూల్, అంబేడ్కర్ జంక్షన్, అల్లిపురం జంక్షన్‌లలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డ వారిని శనివారం నగరంలో స్పెషల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా వారికి ఒక్కొక్కరికి రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ లక్ష్మి మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే న్యాయస్థానాల్లో భారీ జరిమానా తప్పదని, అదే విధంగా మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని తల్లిదండ్రులను హెచ్చరించారు.

24వ రోజుకు శ్రావణలక్ష్మి పూజలు

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ పూజలు శనివారం 24వ రోజుకి చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరాల నడుమ ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ పాల్గొన్నారు.

అలరించిన హాస్యవల్లరి



స్కిట్ ప్రదర్శిస్తున్న కోరుకొండ రంగారావు బృందం

మురళీనగర్: మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో ఆదివారం రాత్రి కోరుకొండ రంగారావు బృందం ప్రదర్శించిన హాస్యవల్లరి ప్రేక్షకులను అలరించింది. టీవీ–101, నాలుగు వారాల షాపింగ్ ఫ్రేమ్, ఉద్యోగం పోయింది, జనాభా లెక్కలు, సిట్యుయేషన్ సాంగ్ వంటి స్కిట్లు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించాయి. ఈ సందర్భంగా వైశాఖి స్పోర్ట్స్ పార్కు సభ్యులు హాస్యనటులను సత్కరించారు. మురళీనగర్ పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు హాస్యనాటికలను తిలకించారు.

నేరానికి శిక్ష తప్పదు

- చట్టానికి ఎవరూ అతీతులు కాదు
- చంద్రబాబు అరెస్టుపై ప్రజల స్పందన

గాజువాక : స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును సీఐడీ అధికారులు అరెస్ట్ చేయడంపై జనం హర్షం వ్యక్తం చేస్తున్నారు. సుపరిపాలన అందించాలని అధికారం ఇస్తే దుర్వినియోగం చేశారని విమర్శిస్తున్నారు. ప్రజా సంక్షేమం కోసం వినియోగించాల్సిన ధనాన్ని స్వాహా చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తప్పు చేసిన వారు ఎంత పెద్ద హోదాలో ఉన్నా శిక్ష నుంచి తప్పించుకోలేరని అంటున్నారు. ప్రజల సొమ్మును కొల్లగొట్టేవారు, ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించే వారికి ఇది గుణపాఠం కావాలని కోరుతున్నారు.

బాబు అక్రమాలన్నీ బయటకు రావాలి



చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు అంతులేని అవినీతి చేశారు. వాటిపై విచారణ జరగకుండా దర్యాప్తు సంస్థలను సైతం మేనేజ్ చేశారంటున్నారు. ఈ అక్రమాలన్నీ బయటకు రావాలి. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు సమయం నుంచి దాదాపు ఐదేళ్లలో జరిగిన మొత్తం అవినీతిని బయట పెట్టాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా దర్యాప్తు జరగాలని కోరుకుంటున్నాను.

– జి.రాము, పెదగంట్యాడ

చట్టం నుంచి ఎవరూ తప్పించుకోలేరు



స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో అక్రమాలపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరగాలి. చట్టం నుంచి ఎవరూ తప్పించుకోలేరు. కోర్టుల్లో నిజాలను వెలికి తీయాలి. చంద్రబాబు అయినా, మరెవరైనా చట్టాలకు అతీతులు కాదు. తప్పు చేస్తే శిక్ష అనుభవించక తప్పదు. తనపై వచ్చిన ఆరోపణలను చంద్రబాబు ఎదుర్కోవాలి తప్ప ఇతరులపై నిందలు వేయడం సరికాదు.

– పి.గోవిందరావు, వడ్లపూడి

తప్పు చేసిన వారు దొరక్క తప్పదు



తప్పు చేసినవారు ఎంత గొప్పవారైనా ఏదో ఒకరోజు దొరక్క తప్పదు. ఇన్నాళ్లకు చంద్రబాబు పాపం పండింది. తాను చేసిన తప్పులను కప్పిపుచ్చుకొంటూ వస్తున్న చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వంపై చెడ్డపేరు తెచ్చేందుకు కుట్ర చేస్తున్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ఆయనపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్ల కాలంలో అనేక స్కాంలు జరిగినట్టు మీడియాల్లో కథనాలు వచ్చాయి. వాటన్నింటికీ నిగ్గు తేల్చాల్సిన అవసరం ఉంది.

– పీతల శ్రీను, పాతగాజువాక

చంద్రబాబు అవినీతిని ప్రజలు గమనిస్తున్నారు



చంద్రబాబు అవినీతిని ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. గతంలో ఓటుకు నోటు కేసులో కూడా అడ్డంగా దొరికిపోయి హైదరాబాద్ నుంచి ఇక్కడికి పారిపోయి వచ్చారు. ఇప్పుడు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ స్కాంలో దొరికారు. అమరావతి పేరుతో జరిపిన భూసేకరణపై కూడా అనేక అవినీతి ఆరోపణలున్నాయి. వీటితో పాటు ప్రాజెక్టుల విషయంలో జరిగిన స్కాంలపై కూడా దర్యాప్తు జరపాల్సిన అవసరం ఉంది. దర్యాప్తు సంస్థలు ఎటువంటి ఒత్తిళ్లకు తలొంచకుండా వ్యవహరించాలి.

– మాడిశ రాము, గాజువాక

చట్టం ఎవ్వర్నీ వదలదు



తప్పు చేసిన ఏ ఒక్కర్నీ చట్టం వదలదు. చంద్రబాబు ఇన్నాళ్లూ తప్పించుకోగలిగారు. ఇప్పుడు అన్ని ఆధారాలతో పోలీసులు అరెస్టు చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో అవినీతితో పాటు ఓటుకు నోటు కేసులోను, అమరావతి భూముల కుంభకోణం, వివిధ ప్రాజెక్టులకు చేసిన ఖర్చు తదితర అన్ని కోణాల్లోను దర్యాప్తు చేయాలి. తమ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి ఆయన ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారు. ఇది సరికాదు.

– మురాల భరత్, గాజువాక

యువగళంలో సంఘ విద్రోహ శక్తులు

- అధికారం కోసం రాష్ట్రంలో విధ్వంసం
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో సంఘ విద్రోహ శక్తులు, రౌడీషీటర్లు ఉన్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆరోపించారు. పుంగనూరులో చంద్రబాబు కనుసన్నల్లోనే దౌర్జన్యాలకు తెగబడగా, భీమవరంలో లోకేష్ ప్రోద్బలంతో రౌడీమూకలు పేట్రేగిపోతున్నాయని ధ్వజమెత్తారు. టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పుంగనూరు, భీమవరంలో హింసను ప్రేరేపించడమే కాకుండా, లా అండ్ ఆర్డర్‌ను సవ్యంగా నిర్వహిస్తున్న పోలీసులపైనా దాడి చేసి వారి రక్తం కళ్ల చూశారన్నారు. పోలీసులు సహనం కోల్పోయి కాల్పులు జరుపుతారని, ఆ కాల్పుల్లో కొందరైనా మరణిస్తే వారి శవాలతో రాజకీయం చేయాలని బాబు, కొడుకులు తాపత్రయం పడుతున్నారన్నారు. రెండు ఘటనల్లో పోలీసులు దెబ్బలు తిన్నారే గానీ చంద్రబాబు, లోకేష్ కుట్రలు అమలు కాకుండా తమ రక్తాన్ని ధారపోశారన్నారు. చంద్రబాబు, లోకేష్ డైరెక్షన్‌లో టీడీపీ కిరాయి మూకలు సామాన్య ప్రజల మీద అరాచకంగా, పక్కా ప్లాన్ ప్రకారం దాడి చేస్తే కనీసం ఆ దాడిని దత్తపుత్రుడు పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర చీఫ్ పురందేశ్వరి, కమ్యూనిస్టు పార్టీలు గానీ ఖండించపోగా టీడీపీ వారే దెబ్బలు తిన్నట్టు ఎల్లో పత్రికల్లో, టీవీల్లో చూపించారంటే ఇంతకంటే దుర్మార్గం ఉంటుందా అని ప్రశ్నించారు.

ఎన్నికల్లో గెలవలేకనే..

ఎన్నికల్లో గెలవలేని చంద్రబాబు, లోకేష్‌లు తీవ్రమైన ఒత్తిడికి లోనై పిచ్చిపట్టినట్టుగా ప్రవర్తిస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. యాత్రల పేరుతో తండ్రీకొడుకులు ప్రాంతాల మధ్య విద్వేషాలను రగిలిస్తున్నారని ఆరోపించారు. వీధి రౌడీలు కూడా మాట్లాడని భాషను చంద్రబాబు, లోకేష్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రిపై, మంత్రులపై నోటికొచ్చినట్టు దుర్భాషలాడుతున్నారన్నారు. ప్రశాంతతకు మారుపేరైన పశ్చిమగోదావరి జిల్లా భీమవరం ప్రకాశం చౌక్‌లో లోకేష్ బహిరంగ సభ అనంతరం గునుపూడి శివారులో టీడీపీ శ్రేణులు రాళ్లు, కర్రలతో వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులకు బరితెగించాయన్నారు. మహిళలను భయభ్రాంతులకు గురి చేసేలా దారుణంగా కొట్టారన్నారు. టీడీపీ నేత చింతమనేని ప్రభాకర్ నేరుగా ఈ వ్యవహారాన్ని పర్యవేక్షిస్తూ వైఎస్సార్ సీపీ దళిత కార్యకర్తల ఇళ్లపైకి వెళ్లి దాడులకు పురిగొల్పారని ఆరోపించారు. పుంగనూరులో టీడీపీ శ్రేణుల దాడుల ఘటనలో ఒక కానిస్టేబుల్‌కు ఏకంగా కన్ను పోయిందని, 40 మంది పోలీసులు గాయపడితే, భీమవరం ఘటనలో ముగ్గురు పోలీసుల తలలకు తీవ్ర గాయాలయ్యాయన్నారు. అధికారం కోసం రాష్ట్రాన్ని తగలబెట్టాలని చూస్తున్న చంద్రబాబు, లోకేష్‌లపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, మార్టుపూడి పరదేశి, పల్లా చినతల్లి, కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు, ధర్మాల శ్రీను, గొందేశి మహేశ్వరరెడ్డి, మద్ది శంకరరెడ్డి, రోజారాణి, బోగాది సన్నీ, నాగిశెట్టి శ్రీను, యువశ్రీ, వెంపాడ అప్పారావు, చిక్కా సత్యనారాయణ, బొడ్డ గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ముంచెత్తిన వాన

లోతట్టు ప్రాంతాలు జలమయం



వుడా కాలనీ రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిలోనే ప్రయాణాలు

పెదగంట్యాడ: వర్షం ముంచెత్తింది. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గెడ్డలు, కాలువలు పొంగిపొర్లాయి. రహదారులు చెరువులను తలపించాయి. మండలంలోని నడుపూరు, హౌసింగ్ బోర్డు కాలనీ, డెయిరీ కాలనీ, బర్మా కాలనీ, రామచంద్రనగర్ తదితర ప్రాంతాలు నీట మునిగాయి. దీంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. లోతట్టు ప్రాంతాల్లోని నివాసితుల ఇళ్లలోకి నీరు రావడంతో అవస్థలు పడ్డారు.

అప్పన్న గోసంరక్షణ పథకానికి రూ. 2 లక్షల విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న ఏఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి గోసంరక్షణ పథకానికి నగరంలోని మధురానగర్‌కు చెందిన ఎం.ఎస్.వి.ఎస్.బి.ఎల్. చంద్రిక అనే దాత శనివారం రూ. రెండు లక్షలు అందజేశారు. కొండదిగువ పరిపాలనా కార్యాలయంలో నగదు రూపంలో ఏఈవో రమణమూర్తికి ఇచ్చారు. దేవస్థానం తరఫున దాతకు బాండ్ అందజేశారు. దేవస్థానం ఏఈ హరి, గోశాల సీనియర్ అసిస్టెంట్ సూరిబాబు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ కెపాసిటీ బిల్డింగ్ సదస్సు



వక్త మల్లాది శ్రీనివాస్‌తో స్టీల్‌ప్లాంట్ అధికారులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ విజిలెన్స్ విభాగం ఆధ్వర్యంలో శనివారం కెపాసిటీ బిల్డింగ్ సదస్సు నిర్వహించారు. మూడు నెలల విజిలెన్స్ అవగాహన కార్యక్రమాల్లో భాగంగా ఉక్కు హెచ్‌ఆర్‌డీ సెంటర్‌లో సీవీసీ మార్గదర్శకాల ప్రకారం పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్, సైబర్ హైజీన్ అండ్ సెక్యూరిటీ అంశాలపై ప్రత్యేక సెషన్‌లు నిర్వహించారు. రైల్వేస్ డైరెక్టర్ శ్రీనివాస్ మల్లాది పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్ అంశంపై ముఖ్య వక్తగా ప్రసంగించారు. కాంట్రాక్టు నిర్వహణ, టెండర్ల ఖరారు, కాంట్రాక్ట్‌లకు కట్టుబడి ఉండే వివిధ చట్టాలు, అంశాలు, అర్హత ప్రమాణాలను రూపొందించడం తదితర అంశాలను వివరించారు. గుజరాత్ నేషనల్ ఫోరెన్సికల్ సైన్సెస్ యూనివర్సిటీ సీనియర్ సైంటిఫిక్ ఆఫీసర్ కృతార్థ్ ఝులా సైబర్ హైజీన్ అండ్ సెక్యూరిటీ అనే అంశంపై ప్రసంగించారు. సైబర్ బెదిరింపుల పురోగతి, అధునాతన, సంక్లిష్టత, సంస్థ పనితీరును ప్రభావితం చేసే సమాచారాన్ని రక్షించే మార్గాలపై వివరించారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ సీజీఎం డాక్టర్ కె.హెచ్. ప్రకాశ్, ఉక్కు అధికారులకు ఇది చాలా ఉపయోగకరమైన కార్యక్రమమన్నారు. విజిలెన్స్ జీఎంలు కె. వేణు, వి.జి.మహిధర్, హెచ్‌ఆర్‌డీ జీఎం టి.కె.ఎస్.ఆర్.ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా సెట్విస్ భవనం



శిథిలావస్థలో ఉన్న సెట్విస్ భవనం

అక్కిరెడ్డిపాలెం: రాంనగర్‌లో సెట్విస్ భవనం ప్రమాదకరంగా ఉంది. ఈ భవనం పై అంతస్తు పూర్తిగా శిథిలమై కూలేందుకు సిద్ధంగా ఉండడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 35 సంవత్సరాల క్రితం అక్కిరెడ్డిపాలెం గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో రాంనగర్‌లో సుమారు వెయ్యి గజాల విస్తీర్ణంలో 17 షాపులు నిర్మించి, ఎస్సీలకు ఉపాధి కల్పనలో భాగంగా వీటిని కేటాయించారు. అయితే వాటిని పలువురు లబ్ధిదారులు వేరేవారికి అద్దెలకు ఇచ్చారనే ఆరోపణలున్నాయి. లక్షల్లో అడ్వాన్సులు తీసుకుని, భారీగా అద్దెలు వసూలు చేస్తున్నారని సమాచారం. పూర్తిగా శిథిలావస్థకు చేరిన ఈ భవనంలో ఇప్పటికీ ఆ షాపులు కొనసాగించడం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం ఈ భవనంలో వాటర్ ప్లాంట్, చికెన్, టిఫిన్ పార్లర్, కార్ల మెకానిక్ షెడ్, వాటర్ వాషింగ్ తదితర వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ఈ శిథిల భవనం ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి. అయినా వ్యాపారాలు చేసుకుంటున్న వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.



పెచ్చులూడి ప్రమాదకరంగా ఉన్న భవనంలో ఒక భాగం

నోటీసులిచ్చినా..

2007లో సెట్విస్ భవనంలో అద్దెకు ఉంటున్న షాపుల యజమానులను ఖాళీ చేయాలని సెట్విస్ అధికారులు నోటీసులు జారీ చేసినా వ్యాపారుల్లో మార్పు లేదు. శిథిలావస్థలో ఉన్న భవనం కూలిపోతే ప్రాణనష్టం కూడా జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సెట్విస్ అధికారులు స్పందించాలని.. భవనాన్ని తొలగించి, కొత్తగా షాపులు నిర్మించి లబ్ధిదారులకు కేటాయించాలని కోరుతున్నారు.

ప్రతీ పాఠశాలలో ఎకో క్లబ్



ఎకో ఇండియా శిక్షణ శిబిరంలో పాల్గొన్న ఉమ్మడి విశాఖ జిల్లా కో–ఆర్డినేటర్లు, క్లస్టర్ కో–ఆర్డినేటర్లు

అగనంపూడి: ప్రతీ ఉన్నత పాఠశాలలో ఎకో క్లబ్ ఏర్పాటు చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించేందుకు చర్యలు చేపట్టాలని నేషనల్ గ్రీన్ కోర్(ఏపీఎన్‌జీసీ) అనకాపల్లి, విశాఖ జిల్లాల కో–ఆర్డినేటర్లు శిష్టు ఖగేశ్వరరావు, బాబూరావు సూచించారు. లంకెలపాలెంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఎకో ఇండియా న్యూఢిల్లీ సహకారంతో ఏపీ ఎన్‌జీసీ విశాఖలో రెండు రోజుల శిక్షణ తరగతులు నిర్వహించిందన్నారు. ఎన్‌జీసీ జిల్లా కో–ఆర్డినేటర్లు, క్లస్టర్ కో–ఆర్డినేటర్లకు నిర్వహించిన వర్క్‌షాపులో పాఠశాలల స్థాయిలో ఎకో క్లబ్‌లు ఏర్పాటు చేయడం, విద్యార్థులను భాగస్వాములను చేయడం తద్వారా పర్యావరణ హితం కోసం పాటుపడేలా విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతీ విద్యార్థి ఎకో ఇండియా కార్యక్రమంలో భాగస్వామి అయ్యేలా చేయడం కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని వివరించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కప్పల ప్రసాద్, విజయనగరం జిల్లా కో–ఆర్డినేటర్ వేణు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సత్కారం



సుశీల్ కుమార్‌ను సత్కరిస్తున్న హెచ్‌ఆర్‌పీసీ జాతీయ ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్

అగనంపూడి: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.సుశీల్‌కుమార్‌ను సామాజికవేత్త, హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు జొన్నకూటి విజయ్‌కుమార్ ఘనంగా సత్కరించారు. అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజయ్‌కుమార్ మాట్లాడారు. సుశీల్‌కుమార్ కృషి, పట్టుదలతో అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు గుర్తింపు తీసుకురావడంతో పాటు ప్రతీ ఏటా ఇంటర్ ఫలితాల్లో జిల్లాస్థాయిలో ప్రథమంలో నిలపడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో దివ్య, సీహెచ్.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఆలయ బేడామండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం,మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం గరుడసేవ ఘనంగా జరిగింది.బేడామండపంలోని వెండి గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్టంపజూసి అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

జిల్లాలో 9 ఫ్యాషన్ టెక్నాలజీ సెంటర్ల పునరుద్ధరణ

- డ్వాక్రా మహిళలకు మరిన్ని ఉపాధి అవకాశాలు
- డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి వెల్లడి



సబ్బవరంలో నిరుపయోగంగా ఉన్న ఫ్యాషన్ టెక్నాలజీ భవనాన్ని పరిశీలిస్తున్న లక్ష్మీపతి

సబ్బవరం: జిల్లాలోని 9 ఫ్యాషన్ టెక్నాలజీ సెంటర్లను జగనం–కిరణ్ పేరుతో పునరుద్ధరించి మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. లక్ష్మీపతి తెలిపారు. ఆయన సబ్బవరం వెలుగు కార్యాలయ సిబ్బందితో కలిసి ఇక్కడ గతంలో ఫ్యాషన్ టెక్నాలజీ కోసం ఉమ్మడి విశాఖ జిల్లా డీఆర్‌డీఏ అధికారులు నిర్మించిన రెండంతస్తుల భవనాన్ని శనివారం పరిశీలించారు. ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న ఈ భవనంలో సుమారు 22 మిషన్లు నిరుపయోగంగా ఉన్నట్టు గుర్తించామన్నారు. వాటిని మరలా ఉపయోగంలోకి తీసుకువచ్చి మహిళలకు శిక్షణ అందించి వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. అదే విధంగా వెలుగు పథకంలో మహిళా సంఘాల ద్వారా నిర్వహిస్తున్న మహిళా మార్టులు లాభాల బాటలో నడుస్తున్నాయన్నారు. సబ్బవరంలో ఏర్పాటు చేసిన మహిళా మార్ట్ రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలుస్తూ అత్యధిక లాభాల్లో ఉందని ఆయన అభినందించారు. ఈ మహిళా మార్ట్ లకు అనుబంధంగా మరింత మంది మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఫ్యాషన్ టెక్నాలజీ సెంటర్లను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో ప్రతిపాదించిన తొమ్మిది ఫ్యాషన్ టెక్నాలజీ సెంటర్లలో మాడుగులలో ఇటీవల పునరుద్ధరించడం జరిగిందన్నారు. సబ్బవరం మండలం జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉండడంతో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఏ కార్యక్రమం చేపట్టినా అద్భుతమైన ఫలితాలు సాధిస్తుందన్నారు. పీడీ వెంట డీపీఎంలు సంజయ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

940వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు



శిబిరంలో మాట్లాడుతున నాయకులు

కూర్మన్నపాలెం: కార్మిక శక్తికి విలువనిచ్చి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 940వ రోజు, శనివారం పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఉక్కు ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేయాలంటే ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవాలన్నారు. ఇన్ని రోజులు కార్మికులు పట్టు వదలకుండా పోరాటం చేయడం దేశంలో ఇదే ప్రప్రథమం అని, కార్మిక శక్తికి కేంద్రప్రభుత్వం తలవంచక తప్పదని అన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.